# న్యుమోనియా వ్యాధి ప్రమాదకరం, ప్రాణాంతకం

2021లో న్యుమోనియా అంటువ్యాధితో 2.2 మిలియన్లు మరణించగా అందులో 5.02 లక్షల మంది పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల అధిక మరణాలకు కారణమైన వ్యాధి న్యుమోనియా. కోవిడ్-19 కారణంతో మరో 10 మిలియన్లు కూడా అదనంగా మరణించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అధిక ప్రాణాలను గైకొంటున్న వ్యాధుల్లో న్యుమోనియా ప్రధానమైనదని తేలింది. వాతావరణ ప్రతికూల మార్పులు, గాలి కాలుష్యం కోరలు చాచడంతో శ్వాస వ్యవస్థ, ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నం కావడం, న్యుమోనియా మహా విపత్తు వస్తుందనే భయం కూడా ఉందని, మిలియన్ల జనులు న్యుమోనియా సోకే ప్రమాదపు అంచున ఉన్నారని వైద్యులు అంచనా వేస్తున్నారు. న్యుమోనియా వ్యాధి ఐదేండ్ల లోపు పిల్లలకు, వృద్ధులకు వస్తుంది. టీకాలు వేయించుకోని వారు, పోషకాహారలోపాలు, ఇంట్లో వంట చెరుకు వాడే వారు, కలుషిత గాలి పీల్చే పెద్దలు, పొర త్రాగే దురలవాటు ఉన్న వారు అధికంగా న్యుమోనియా బారిన పడే ప్రమాదం ఉంటుంది.

### ప్రపంచ న్యుమోనియా దినం-2024 థీమ్

**(12 నవంబర్ "ప్రపంచ న్యుమోనియా దినం" సందర్భంగా)**

న్యుమోనియా వ్యాధి తీవ్రత, ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2009 నుంచి ప్రతి ఏట 12 నవంబర్ రోజున "ప్రపంచ న్యుమోనియా దినం" పాటిస్తూ ఆ వ్యాప్తి పట్ల కనీస అవగాహన కల్పించడం జరుగుతోంది. బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగీ సంక్రమణ కారణంగా తాపజనక శ్వాస రుగ్మత (ఇన్‌ఫ్లమేటరీ రెస్పిరేటరీ డిసార్డర్) లేదా న్యుమోనియా వ్యాధి అంటుకుంటుంది. ఈ సూక్ష్మజీవులు ఊపిరితిత్తుల్లో చేరి "ఎల్వియోలి" అనే భాగంపై ప్రభావాన్ని చూపి న్యుమోనియాకు దారి తీస్తుంది. దీని వల్ల ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. బలహీన వ్యాధినిరోధకశక్తి కలిగిన పిల్లలు, వృద్ధులకు న్యుమోనియా సోకి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. ప్రపంచ న్యుమోనియా దినం -2024 థీమ్‌గా "ప్రతి శ్వాస ముఖ్యమే : న్యుమోనియాను మార్గంలోనే ఆపేద్దాం(ఎవ్రీ బ్రీత్ కౌంట్స్ : స్టాప్ న్యుమోనియా ఇన్ ఇట్స్ ట్రాక్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

### న్యుమోనియాలో రకాలు

న్యుమోనియా నివారించదగిన అంటు వ్యాధి. వ్యాధిగ్రస్థులు తుమ్మడం, దగ్గడం, ముక్కు చీదడం లాంటి సందర్భాల్లో మరొకరికి సంక్రమిస్తుందని తెలుసుకోవాలి. పిల్లల్లో బ్యాక్టీరియా కారణ స్ట్రెప్టోకోకల్ న్యుమోనియా అతి ప్రధానమైనది. దాని తర్వాత హిమోఫిలస్ ఇన్‌ఫ్లుయెంజా రెండవ ప్రధానమైనది.

న్యుమోనియాలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి వైరస్ వర్గంలో ముఖ్యమైనది. న్యుమోనియా వ్యాధికి చికిత్స కూడా అందుబాటులో ఉన్నది.

ప్రపంచ న్యుమోనియా దినం వేదికగా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌జిఓలు, ఇతర సంస్థలు కలిసి న్యుమోనియా పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగగ్రస్థులకప చికిత్సా పద్ధతులు వివరించడం మంచి ఫలితాలను ఇస్తాయి. న్యుమోనియాను తొలిదశలో గుర్తించడం, చికిత్స తీసుకోవడం, నివారణ మార్గాలను తెలుసుకోవడం లాంటి అంశాలను గుర్తుంచుకోవాలి.

### న్యుమోనియా సోకడానికి కారణాలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి ఏట 14 లక్షల పిల్లలు న్యుమోనియా సోకి చనిపోవడం, పిల్లల మరణాల్లో 18 శాతం వరకు న్యుమోనియా కారణం కావడం గమనార్హం. యూనిసెఫ్ వివరాల ప్రకారం ప్రతి 39 సెకన్లకు ఒక పిల్లవాడు న్యుమోనియాతో మరణిస్తున్నాడు.

వృద్ధుల్లో న్యుమోకోకల్ న్యుమోనియా అధికంగా సోకుతుంది. న్యుమోసిస్టిక్ జిరోవెస్సీ వ్యాధి ఫంగస్ సోకడంతో వస్తుంది. గాలి కాలుష్యం, స్మోకింగ్ వల్ల 16 లక్షల వృద్ధులు మరణిస్తున్నారు. డబ్ల్యూహెచ్ఓ, యూనిసెఫ్‌లు సంయుక్తంగా న్యుమోనియా, డయేరియా వ్యాధుల కట్టడికి గ్లోబల్ ఆక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు.

ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏండ్లు దాటిన వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులు, పర్యావరణ కాలుష్య ప్రాంతాల్లో నివసిస్తున్న జనులు, హెచ్ఐవి/క్యాన్సర్ లాంటివి సోకిన వ్యాధిగ్రస్థులు న్యుమోనియా ప్రమాదంలో పడే అవకాశాలే ఎక్కువ.

### నివారణ మార్గాలు

టీకాలు వేయించడం, పోషకాహారం అందిచడం, గాలి కాలుష్యాన్ని తగ్గించడం వల్ల న్యుమోనియా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. ఆంటీబ్యాక్టీరియల్, అంటీ వైరల్, ఆంటీ ఫంగల్ ఔషధాలతో న్యుమోనియా కట్టడి జరుగుతుంది.

భౌతిక దూరాలు పాటించడం, మాస్కులు ధరించడం, పబ్లిక్ పిరజేశాల్లో ఉమ్మి వేయకుండా ఉండడం, దగ్గినపుడు లేదా తుమ్మినపుడు కండువా కప్పుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, నదుల్ని కలుషితం కాకుండా చూసుకోవడం లాంటి పలు దాగ్రత్తలు న్యుమోనియా కేసులను తగ్గిస్తాయి.

పిల్లలకు, పెద్దలకు అతి ప్రమాదకరమైన అంటు వ్యాధిగా నిలిచిన న్యుమోనియా పట్ల సరైన అవగాహన పెంచుకొని అలాంటి ప్రాణాంతక రుగ్మతకు చరమగీతం పాడదాం, న్యుమోనియా కానరాని భారతాన్ని నిర్మించుకుందాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 'లైట్స్, కెమెరా,గోవా! ఇఫీ 2024 వేడుకల్లో భాగం కండి" నవంబర్ 20 నుంచి 28 వరకు




న్యూఢిల్లీ, నవంబర్ 12:జాతీయ చలనచిత్ర అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ), ఎంటర్టైన్మెంట్ సొసైటీ ఆఫ్ గోవా(ఈఎస్‌జీ) సహకారంతో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ నెల 20 నుంచి 28 వరకు 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ )ను నిర్వహిస్తుంది. ఆకర్షణీయమైన, వైవిధ్యమైన కార్యక్రమాలతో నిండిన ఈ కార్యక్రమం సినిమా ప్రేమికులకు మరపురాని అనుభూతిని ఇస్తుంది.

55వ ఇఫీ ఆరంభానికి ముందుగా మీడియా సమావేశం ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసారాలు, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్, సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, సమాచార, ప్రసార శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీమతి నీరజా శేఖర్, ఇఫీ ఉత్సవ సంచాలకులు శ్రీ శేఖర్ కపూర్, సీబీఎఫ్‌సీ ఛైర్మన్ శ్రీ ప్రసూన్ జోషి, మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఎల్.మురుగన్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఈ ఉత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. "భారత్‌లో మాత్రమే కాకుండా కేన్స్ లాంటి అంతర్జాతీయ వేడుకలతో పోల్చదగిన ముఖ్యమైక కార్యక్రమం ఇఫీ" అని వర్ణించారు. ఏటా ఉత్సవాల అనుభవాన్ని మెరుగుపరిచేవిధంగా చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి ప్రధానంగా ప్రస్తావించిన డాక్టర్ మురుగన్, ఈ ఏడాది వేడుకలకు అంతర్జాతీయంగా విశేష స్పందన వచ్చిందని తెలిపారు. ఇది చలనచిత్రోత్సవ విస్తృతిని, ప్రభావాన్ని తెలియజేస్తుంది.

ఈ కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచేందుకు ముంబయి, చెన్నైతో సహా ప్రధాన నగరాల్లో ఇటీవలే రోడ్ షోలను మంత్రిత్వశాఖ నిర్వహించింది. త్వరలోనే హైదరాబాద్‌లోనూ ఈ కార్యక్రమం జరగనుంది. ఆత్మనిర్భర భారత్ స్ఫూర్తిని, ఇఫీని అంతర్జాతీయ సినీ వేడుకగా జరుపుకోవాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను ప్రతిబింబించేలా సినీ ప్రముఖులు దీన్ని తమ సొంత పండగలా స్వీకరించాలని డాక్టర్ మురుగన్ కోరారు. ప్రజలందరూ గోవాలో జరిగే ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.

ఇఫి 2024 ఇతివృత్తం 'యువ సినీ దర్శకులు' "భవిష్యత్తు ఇప్పుడే"

కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఆలోచనలకు అనుగుణంగా ఇఫీ 2024 ఇతివృత్తం యువ దర్శకులపై ప్రధాన దృష్టి సారించింది. వారి సామర్థ్యాన్ని గుర్తించి సృజనాత్మక భవిష్యత్తును రూపొందించేందుకు ప్రాధాన్యమిస్తుంది.

"వైవిధ్యమైన విధానాలు, ఆలోచనలను అందిపుచ్చుకుంటూ, ప్రపంచంలోనే అతి పెద్ద చిత్ర నిర్మాణ దేశంగా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ పరిశ్రమలో నూతనంగా ఆవిర్భవిస్తున్న ప్రతిభ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తన ప్రారంభోపన్యాసంలో వివరించారు. ఇఫీ 2024 సినిమా రూపకర్తలు, సినీ ప్రేమికులు ఇద్దరి కోసం రూపొందించామని, భవిష్యత్తును నిర్దేశించే వారికి, ముఖ్యంగా దేశ సాంస్కృతిక నేపథ్యాన్ని రూపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న యువ దర్శక నిర్మాతలకు ప్రాధాన్యమిస్తుందని తెలిపారు.

క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో వేదికను 100 మంది యువ ప్రతిభావంతులకు సాయం అందించేలా మెరుగుపరిచారు. దీని ద్వారా గతంలో జరిగిన చలనచిత్రోత్సవాల్లో 75 మందికి మాత్రమే మద్దతు లభించేది. దేశవ్యాప్తంగా వివిధ ఫిలిం స్కూళ్లకు చెందిన 400 మంది యువ సినిమా విద్యార్థులు ఇఫీకి హాజరయ్యేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను మంత్రిత్వ శాఖ కల్పిస్తుంది.

దేశంలో యువ చిత్ర దర్శకుల ప్రతిభను గుర్తించేందుకు మొదటి సారిగా నూతన పురస్కార విభాగాన్ని పరిచయం చేశారు. అదే ఉత్తమ భారతీయ డెబ్యూ డైరెక్టర్. యువ దర్శకుల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు, చర్చా వేదికలు, చిత్ర మార్కెట్, సినిమా ప్యాకేజీలను రూపొందించారు. ఈ వేడుక చలనచిత్ర రంగంలో దిగ్గజాలకు నివాళి అర్పిస్తుంది. అలాగే వైవిధ్యమైన దృక్పథాలను ప్రత్యేక విభాగాలు, ఎగ్జిబిషన్ల ద్వారా ప్రదర్శిస్తుంది. ఇది గోవాలోని ప్రేక్షకులకు ప్రత్యేకమైన అనుభవాన్నిస్తుంది.


సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి 55వ ఇఫీలో భాగస్వామ్య అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. చలనచిత్ర పరిశ్రమ కోసం చిత్ర పరిశ్రమే నిర్వహించే వేడుకగా వర్ణించారు. ప్రముఖ దర్శకుడు శేఖర్ కపూర్ ఈ ఉత్సవానికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దీనిని చరిత్రాత్మకంగా పేర్కొంటూ, "చలన చిత్రోత్సవ చరిత్రలో మొదటిసారిగా, ఈ మొత్తం కార్యక్రమానికి నాయకత్వం వహించే బాధ్యతను పరిశ్రమకే అప్పగించే సంప్రదాయాన్ని ప్రారంభించాం" అని తెలిపారు.

సినిమాలో కథన ప్రాధాన్యం గురించి చిత్రోత్సవ డైరెక్టర్ శేఖర్ కపూర్ ప్రస్తావించారు. ఇది చలన చిత్రానుభూతికి హృదయంగా అభివర్ణించారు.

# బాలికలపై నీట్ కోచింగ్ సెంటర్ టీచర్లు అత్యాచారం - ఇద్దరు అరెస్ట్

లక్నో నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బాలికలపై నీట్ కోచింగ్ సెంటర్ టీచర్లు అత్యాచారానికి పాల్పడి అనంతరం వీడియోను రికార్డు చేసి ఆమెను బ్లాక్ మెయిల్ చేశారు. అలాగే మరో యువతిని వేధించడంతో ఆమె పోలీసులు ఫిర్యాదు చేసింది. పోలీసులు టీచర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లో జరిగింది. పోలీసులు తెలివిన వివరాల ప్రకారం.. కాన్పూర్‌లోని ప్రసిద్ధ నీట్ కోచింగ్ సెంటర్‌లో ఓ యువతి చేరింది. బయోలజీ టీచర్ సాహిల్ సిద్ధిఖీ తన ఇంట్లో పార్టీ ఉందని యువతిని ఆహ్వానించాడు. సిద్ధిఖీ ఇంటికి వెళ్లేసరి ఎవరు లేకపోవడంతో అనుమానం వచ్చింది. కూల్ డ్రింక్ మత్తు మందు ఇచ్చి యువతి చేత తాగించాడు.ఆమె స్పృహ కోల్పోయిన తరువాత యువతిపై సిద్ధిఖీ అత్యాచారం చేశాడు. వీడియో రికార్డు చేసి ఆమెపై అతడు పలుమార్లు అత్యాచారం చేశాడు. కెమిస్ట్రీ టీచర్ వికాస్ పోర్వల్ కూడా ఆమెపై అత్యాచారం చేశాడు.

# ప్రజలకు ఏం చేశారని ఉత్సవాలు.. ఎమ్మెల్యే ధన్ పాల్




నిజామాబాద్, నవంబర్ 12:కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు ఏం చేశారని ఉత్సవాలు నిర్వహిస్తారని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. ఏడాది పాలనలో ప్రజలకు ఏం చేశారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెసోళ్లు దోపిడీలో బ్రిటిషోళ్లని మించి పోయారని ఎద్దేవా చేశారు. స్కామ్ లు, కమిషన్లు, దోపిడీపై ఉన్న శ్రద్ధ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై లేదన్నారు.

మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ? తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలనపై అనవ్యాంచుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం 26 రోజుల ఉత్సవాలు నిర్వహిస్తాననడం సిగ్గుచేటన్నారు. ఏ మొఖం పెట్టుకొని ఉత్సవాలు నిర్వహిస్తారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

బీజేపీ సమగ్ర సర్వేకు వ్యతిరేకం కాదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజల దృష్టి మళ్లించడానికి సమగ్ర సర్వే కార్యక్రమం చేపట్టారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ డైవర్ట్ పొలిటికల్ కార్యక్రమం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో నాగోళ్ళ లక్ష్మీ నారా యణ, మాస్టర్ శంకర్, ఇల్లెందుల ప్రభాకర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడిలో కుట్రదారుడిగా బోగమోని సురేష్

## -గుర్తించిన పోలీసులు వికారాబాద్ ఎడిజి మహేశ్ భగవత్ దర్యాప్తు

కొడంగల్ నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కొడంగల్‌లోని లగచర్ల గ్రామంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి చేయడం మీద సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడిలో బోగమోని సురేష్ కుట్రదారుడిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు డిజిపి ఆదేశాలతో వికారాబాద్‌కు ఎడిజి మహేశ్ భగవత్ చేరుకున్నారు. ఉద్దేశపూర్వకంగానే కలెక్టర్‌ను గ్రామంలోకి సురేష్ తీసుకెళ్లాడు. సురేష్ చెప్పగానే ప్రజలతో మాట్లాడానికి కలెక్టర్ ఊర్లోకి వెళ్లాడు.గ్రామంలో ప్రజలతో మాట్లాడుతుండగా కలెక్టర్ పై గ్రామస్థులు దాడికి తెగపడ్డారు. దాడికి ముందు పట్నం నరేందర్ రెడ్డితో సురేష్ 42 సార్లు మాట్లాడాడు. సురేష్‌తోనూ మాట్లాడుతూనే నరేందర్ రెడ్డి కెటిఆర్‌తో ఫోన్‌లో ఆరు సార్లు మాట్లాడారు. బోగమోని సురేష్‌ను బిఆర్ఎస్ కార్యకర్తగా పోలీసులు గుర్తించారు.సురేష్‌పై ఇప్పటికే రేప్ కేసులో సహా పలు కేసులు ఉన్నాయి. చెల్లెలు వరుసయ్యే అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడిన కేసు అతడిపై ఉంది. సురేష్ బిఆర్ ఎస్ నేత పట్నం నరేంద్ర రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్నాడు. సురేష్‌పై కేసులు తొలగించేలా పట్నం నరేంద్ర రెడ్డి సాయం చేశాడు. కలెక్టర్‌పై దాడి తరువాత సురేష్ పరారీలో ఉన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో సురేష్ దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. లగచర్ల ఘటనలో ఇప్పటివరకు 52 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నామని ఎస్‌పి నారాయణ రెడ్డి తెలిపారు.



# ధాన్యం కొనుగోళ్లలో భారీ అవినీతి- జగదీష్ రెడ్డి




హైదరాబాద్, నవంబర్ 12:ధాన్యం కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ పత్తి, వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటున్నది. సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ చేస్తున్నట్లు డ్రామాలు ఆడుతున్నారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఫైర్ అయ్యారు. కొనుగోళు జరపకుండా పథకం ప్రకారం రైతులను దళారీలకు, మిల్లర్లకు వదిలేశారని విమర్శించారు. దీని వెనుక వందల కోట్ల అవినీతి జరిగింది. ప్రభుత్వంలో మంత్రులు దళారులు, మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారని మండిపడ్డారు.

పదేళ్ల కాలంలో కేసీఆర్ పండిన ప్రతి గింజను కొన్నారు. నల్గొండ జిల్లా మంత్రి రైతుల వద్ద ధాన్యం కొనకుండా అధికారులను బెదిరించారు. జిల్లా మంత్రి దళారులతో కుమ్మక్కై వందల కోట్లు వసూలు చేశారన్నారు. 2014 కు ముందు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు మళ్లీ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎందుకు దోపిడీకి గురి అవుతున్నారో సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెప్పాలన్నారు.ఇప్పటి వరకు ఒక్క గింజ సన్న వడ్లు ప్రభుత్వం కొనలేదని, సమాధానం చెప్పడానికి అధికారులు భయపడుతున్నారని తెలిపారు.

ప్రజలు మర్చిపోయారు అంటున్న కేసీఆర్‌ను చూసి రేవంత్ రెడ్డికి ఎందుకు భయం అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు మొదలయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని వాడుకుని రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్ రెడ్డిని చూసి భయపడుతున్నారని చెప్పారు. కలెక్టర్ మాపైన దాడి జరగలేదని చెప్పారు. ప్రభుత్వం కేసులు ఎందుకు పెడుతున్నదని ప్రశ్నించారు. రాష్ట్రంలో మేధావులు కొడంగల్‌కు వెళ్లి రావాలని హితవు పలికారు. కొడంగల్ నియోజకవర్గంలో అధికారులను అడ్డుకోవాలని బీఆర్ఎస్ పిలుపు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

ఢిల్లీకి 25 సార్లు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి ఎవరి కాళ్లు మొక్కారో ప్రజలకు తెలుసన్నారు. కేటీఆర్ ఢిల్లీకి వెళ్లింది కాంగ్రెస్, బీజేపీ పార్టీల బండారం బయటపెట్టడానికి అని పేర్కొన్నారు. ఎవిడెన్స్ కోసం బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. దానికి మాజీ ఎమ్మెల్యేలు సమాధానం ఇస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిపై బండి సంజయ్, కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రిపై జరిగిన ఈడీ రైడ్స్ ను ఎందుకు బయటపెట్టలేదు? కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేవంత్ రెడ్డి వీపు పగలగొట్టడం ఖాయమన్నారు.

# వనపర్తిలో రోడ్డుప్రమాదం.. 25మంది కూలీలకు గాయాలు

మహబూబ్‌నగర్, నవంబర్ 12:వ్యవసాయ పనులకు కూలీలను తీసుకెళుతున్న వాహనం బోల్తా పడిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం ఓ వాహనం బోల్తా పడడంతో అందులోని 25 మంది కూలీలకు గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలి పారు. బాధితులు, స్థానికుల సమాచా రం మేరకు.. కొత్తకోట మండలం బూత్కూరు గ్రామానికి చెందిన వ్యవ సాయ కూలీలు పొరుగున ఉన్న మహ బూబ్ నగర్ జిల్లాలోని ఎంకంపల్లి గ్రామానికి పత్తి ఏరడానికి బయలుదేరారు.

నలభై మందికి పైగా కూలీలతో బయలుదేరిన వాహనం పెద్దమందడి మండలం మోజెర్ల స్టేజీ సమీపంలో ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తా పడింది. దీంతో అందులోని కూలీలకు గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను సమీపంలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల చికిత్సతో పలువురు కూలీలు కోలుకోగా.. ముగ్గురు కూలీల పరిస్థితి మాత్రం సీరియస్ గా ఉందని వైద్యులు చెప్పారు.



# చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా భయపడం.. మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు




అమరావతి, నవంబర్ 12:సోషల్‌మీడియా కార్యకర్తలకు వైసీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ఆనాడు ఎమ్మెల్యేలను లోకేసుని మైనస్ జగన్‌ను ఒంటరి చేయాలనే ప్రయత్నం చేసి చంద్రబాబు భంగపడ్డారని అన్నారు. ఇప్పుడు మళ్లీ వైసీపీ సోషల్‌మీడియాను బయపెట్టాలని కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు మళ్లీ భంగపాటు తప్పదని చెప్పారు. చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా సరే వైసీపీ కార్యకర్తలు భయపడరని స్పష్టం చేశారు.

గుంటూరు జైలులో ఉన్న వైసీపీ సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌లు మేక వెంకట్రామిరెడ్డి, కళ్లం హరికృష్ణ రెడ్డి, పాముగంటి చైతన్యను పేర్ని నాని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి అంబటి రాంబాబు పరామర్శించారు. అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. వర్రా సుధారాణి దంపతులను పోలీసులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.

మహిళ అని కూడా చూడకుండా పోలీసులు టార్చర్ చేస్తున్నారని మండిపడ్డారు. వర్రా రవీందర్ రెడ్డిని అర్ధరాత్రి ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. ముసుగు వేసి మీడియా ముందు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏముందని నిలదీశా రు. ఏపీలో పౌర హక్కులు ఏమవు తున్నాయని ప్రశ్నించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ కుటుంబసభ్యులపై టీడీపీ సోషల్‌మీడియాలో చాలా దారుణంగా పోస్టులు పెడుతున్నారని అంబటి రాంబాబు మండిపడ్డారు. వాటిపై వైసీపీ నేతలు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ వాళ్లే ఫేక్ అకౌంట్లతో అక్రమ పోస్టింగ్‌లు పెడుతున్నారని తెలిపారు. పోలీసులు అక్రమంగా నిర్బంధించి వైఎస్ జగన్, మాజీ మంత్రులు, ఎమెల్యేల పేర్లు చెప్పమని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

# వన్యప్రాణుల అక్రమ రవాణా- ముగ్గురు అరెస్టు

అమరావతి, నవంబర్ 12:ఒడిశా రాష్ట్రం నుంచి కర్ణాటక రాష్ట్రానికి ఆఫ్రికన్ జాతికి చెందిన 21 వన్యప్రాణులను కారులో అక్రమంగా తరలిస్తుండగా ఇచ్ఛాపురం వద్ద సోమవారం రాత్రి పట్టుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని పలాస అటవీశాఖ రేంజర్ ఏ.ఎం.కె.నాయుడు తెలిపారు.

మంగళవారం అటవీ అధికారి మాట్లాడుతూ ఆఫ్రికన్ జాతికి చెందిన 17 కొండచిలువ పిల్లలు, ఆఫ్రికన్ జాతికి చెందిన పెద్ద తాబేలు ఒకటి, చిన్న తాబేళ్లు రెండు, అదే జాతికి చెందిన అడవి పిల్లిని మొత్తం 21 వన్యప్రాణులను నయ్యద్ ముయాకాత్‌ల్లా, విజయకుమార్, ముజాహిత్ అహ్మద్ ఖాన్లు కారులో ఒడిశా నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తుండగా అటవీ అధికారులు రోజువారీ తనిఖీల్లో భాగంగా వీరు పట్టుబడ్డడం జరిగిందన్నారు. వీరిపై వన్యప్రాణుల అక్రమ రవాణా చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను ఇచ్ఛాపురం కోర్టులో హాజరు పరుస్తున్నామని, వన్యప్రాణులను విశాఖ జూకు తరలించడం జరుగుతుందన్నారు.

# భారతీయ సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని రాష్ట్రీయ ఏక్తా పర్వ్ వేడుకలు ప్రతిబింబిస్తాయి: జి.కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, నవంబర్ 12:గౌరవనీయులైన ప్రధానమంత్రి మార్గదర్శకత్వంలో "ఏక్ భారత్, శ్రేష్ట భారత్" భావన కేంద్రంగా ఈరోజు మనం అందరం ఇక్కడ కలిశామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. తిరుమలగిరిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో ఈ రోజు జరిగిన జాతీయ స్థాయి రాష్ట్రీయ ఏక్తా పర్వ్ ఉత్సవాలను కేంద్ర మంత్రి ప్రారంభించారు.

ప్రతి కేంద్రీయ విద్యాలయాన్ని మినీ ఇండియాగా పోల్చుతూ, ఇవన్నీ శక్తిమంతమైన, పూర్తి సామర్థ్యంతో నిండినవిగా కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అభివర్ణించారు. కేంద్రీయ విద్యాలయాల ద్వారా విద్యను అందించడమే కాకుండా, జాతీయ ఏకతా స్ఫూర్తిని పెంపొందిస్తున్నాం. ఈ పాఠశాలలు భారతదేశ స్వభావమైన భిన్నత్వంలో ఏకత్వమనే సౌందర్యాన్ని సూచిస్తాయి. ఇక్కడ వివిధ భాషలు, సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన విద్యార్థులు ఒక్క చోట చేరి, జీవితాంతం కొనసాగే బంధాలను ఏర్పరుచుకుంటారు. కేంద్రీయ విద్యాలయాలు విద్యాసంస్థల కంటే ఎక్కువ. ఎందుకంటే అవి జ్ఞానాన్ని, విలువలను, వ్యక్తిగత వృద్ధి అవకాశాలను పరస్పరం పంచుకునే సమూహాలు.

కేంద్రీయ విద్యాలయకు చెందిన విద్యార్థుల ఉత్సుకత, సృజనాత్మకత అందరికీ స్ఫూర్తినివ్వడంతో పాటు దేశంలోనే ఉత్తమ ప్రతిభను వారు ప్రదర్శిస్తున్నారని మంత్రి అన్నారు. శతాబ్దాల నాటి మన సుసంపన్నమైన నాగరికత ప్రపంచాన్ని సానుకూలంగా ప్రభావితం చేసింది. విశ్వగురు ? మార్గదర్శక వెలుగుగా, విశ్వ మిత్ర ? ఎంతోమందికి స్నేహితునిగా వ్యవహరిస్తోంది. రాష్ట్రీయ ఏకతా పర్వ్‌లో భాగంగా, ఘనమైన దేశ సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని మనం ప్రేమతో ఉత్సవంలా జరుపుకుంటున్నాం. భిన్నత్వం ఉన్నప్పటికీ వివిధ సమూహాలు, సంస్కృతులు, సంప్రదాయాల మధ్య గౌరవం, అవగాహనను పెంపొందిస్తూ, కలిసి ఉండటంలోనే మన బలం దాగి ఉంది. ఇదే మన దేశంలో సామరస్యాన్ని పెంపొందిస్తుంది. ఈ కార్యక్రమం మన విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో భారత దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని అనుసంధానిస్తుంది. ప్రధానమమంత్రి నరేంద్రమోదీ ఆలోచనలకు అనుగుణంగా మన సంస్కృతితో మనల్ని ఏకం చేస్తుంది. అలాగే కాలతీతంగా అనుసరించాల్సిన విలువల ఆవశ్యకతను తెలియజేస్తుంది.

2047 లక్ష్యం గురించి వివరిస్తూ, ఈ ప్రత్యేకమైన సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడంలో యువత పోషించే కీలక పాత్రను గుర్తించామని మంత్రి తెలిపారు. నేటి విద్యార్థులు రేపటి పౌరులు మాత్రమే కాదని, ప్రగతి, సంక్షేమం దిశగా భారత్‌ను నడిపించే రథసారథులని పేర్కొన్నారు. చరిత్రలో ఆదిశంకర నుంచి సర్దార్ పటేల్ వరకు ఎందరో నాయకులు భారత్‌లో జన్మించారని, మన ఆదర్శాలను నిలబెట్టడానికి, మన గుర్తింపును బలోపేతం చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేశారని అన్నారు. మన దేశం వికసిత్ భారత్ ? అభివృద్ధి చెందిన భారత్‌గా మారాలని ఆకాంక్షిస్తోంది. మన యువతే మనకున్న గొప్ప నమ్మకం, ఆస్తి. సమాజంలో వివిధ రంగాల్లో తమవంతు సహకారాన్ని అందిస్తున్న యువ మేధను చూసి నేను ప్రేరణ పొందుతున్నాను.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్ఫూర్తిదాయకమైన నాయకత్వంలోని ప్రభుత్వం... కలలను సాకారం చేసుకునే దిశగా యువతను నడిపించేందుకు కృతనిశ్చయంతో ఉందని మంత్రి తెలిపారు. ప్రతి విద్యార్థిలో దాగున్న శక్తిని వెలికి తీసేలా జాతీయ విద్యావిధానానికి రూపకల్పన చేశారు. అలాగే క్రీడలు, కళలు, విలువలు, సాంస్కృతిక అవగాహనతో కూడిన అభ్యాస విధానాలను అవలంబించి తర్వాతి తరాన్ని విస్తృతమైన ఆకాంక్షల సాధన కోసం సన్నద్ధం చేయడం కూడా దీనిలో భాగమే. విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించి, క్రీడాధారిత పద్ధతిలో నేర్చుకోవడాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశం. చిన్నారుల్లో నైపుణ్యాలను పెంపొందించి 21వ శతాబ్దపు నాయకులుగా మారేలా మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది నూతన భారత దేశం – స్వయం సమృద్ధం సాధించి ప్రపంచ వేదికపై తన స్థానాన్ని సుస్థిరం చేసుకొనేందుకు సిద్ధంగా ఉంది.

ఈ ప్రయత్నాల ద్వారా మనం కలలు కంటున్న స్వయం సమృద్ధ భారతాన్ని నిర్మించే క్రమంలో యువతను శక్తిమంతులను చేసి, క్రియాశీలక పాత్రను పోషించేలా వారిని సిద్ధం చేసేందుకు అవిశ్రాంతంగా మేం కృషి చేస్తున్నాం. వ్యవసాయం నుండి రక్షణ, ఆవిష్కరణలు, ఆరోగ్యం రంగం ఇలా వివిధ రంగాల్లో భారత్ ప్రస్తుతం బలంగా ఉంది. మన యువత ఈ దేశ ఆత్మ, భవిష్యత్తును తనలో నింపుకుందని నేను విశ్వసిస్తున్నాను. భారతదేశ అభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చడంలోనూ, ప్రధానమంత్రి ఆకాంక్షలను నిజం చేయడంలో యువత పాత్ర కీలకం. వారిని రేపటి తరం నాయకులుగా చూస్తున్నాను. తాము ఎంచుకున్న మార్గాల్లో ఉత్సాహంగా ముందుకు సాగుతారని నేను భావిస్తున్నాను. మీ జీవితం ఎటువైపు సాగినా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరుకుంటున్నాను. ముందున్న ప్రయాణ మార్గాన్ని స్వీకరించాలని విద్యార్థులకు కేంద్ర మంత్రి సూచించారు. శక్తివంతమైన దేశంగా మారాలని భారత్ ఉవ్విళ్లూరుతున్న తరుణంలో ఈ రోజు కీలకమైన సందర్భంగా నిలిచిపోతుంది. మనమంతా కలసి దేశాన్ని ప్రపంచానికి నాయకత్వం వహించే స్థానానికి చేర్చే బాధ్యతను పంచుకుందాం. దేశంలోని యువత ఇప్పటికే వివిధ రంగాల్లో ప్రగతిని సాధిస్తున్నారని, మన భవిష్యత్తును రూపొందిస్తున్నారని మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు శ్రీ ఇ. రాజేందర్, న్యూఢిల్లీలోని పాఠశాల విద్య, అక్షరాస్యత, విద్యా శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ గౌరవ కమిషనర్ శ్రీమతి నిధిపాండే, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ జాయింట్ కమిషనర్ (అకడమిక్స్) డాక్టర్ దేవ్ కుమార్, హైదరాబాద్ ప్రాంత డిప్యూటీ కమిషనర్ శ్రీ డి. మంజునాథ్, సహాయక కమిషనర్లు, దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల ప్రిన్సిపాళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) ద్వారా జాతీయ సమగ్రతను ప్రోత్సహించేందుకు, భారతీయ సంస్కృతి, కళలను ప్రశంసించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమమే రాష్ట్రీయ ఏక్తా పర్వ్. వివిధ రాష్ట్రాల సుసంపన్నమైన వారసత్వం, సంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతిని ప్రదర్శించడం కూడా ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం. సర్దార్ వల్లభభాయ్ పటేల్ అందించిన వారసత్వాన్ని గౌరవిస్తూ దేశ ఐక్యతను బలోపేతం చేయడంలో విద్య ప్రాముఖ్యాన్ని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ తెలియజేసింది. సాంస్కృతిక వైవిధ్యం, కళాత్మక ప్రతిభను ప్రదర్శించిన ఈ కార్యక్రమం ఏక్ భారత్ శ్రేష్టభారత్ స్ఫూర్తికి ఉదాహరణగా నిలిచింది.

ఈనెల 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో బృంద గానం, బృంద నృత్యం, ఇతర కళాపోటీలు నిర్వహిస్తారు. వీటిలో కేవీఎస్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొంటారు. ఏక్ భారత్, శ్రేష్ట భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ సాగిన ఈనాటి ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

# దేశ అవసరాలనే కాదు, ప్రపంచ ఆవశ్యకతను కూడా తీర్చగలదు: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 12:గుజరాత్ లోని వడ్తాల్ లో ఉన్న శ్రీ స్వామి నారాయణ మందిరం 200వ వార్షిక వేడుకల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ప్రజలనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. శ్రీ స్వామి నారాయణ అనుగ్రహంతోనే 200వ వార్షికోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్వామి అనుచరులందరికీ స్వాగతం పలికిన శ్రీమోదీ.. స్వామి నారాయణ మందిర సంప్రదాయంలో సేవే ప్రధానమని, శిష్యులంతా నేడు సేవలో నిమగ్నమయ్యారని అన్నారు. ఈ వేడుకలను ఇటీవల మీడియాలో చూడడం తనకు సంతోషాన్నిచ్చిందని ప్రధానమంత్రి అన్నారు.

వడ్తాల్ ధామ్ లో 200వ వార్షిక వేడుకలు కేవలం చరిత్ర మాత్రమే కాదని పేర్కొన్న శ్రీమోదీ.. ఆ ధామంపై అత్యంత భక్తివిశ్వాసాలతో చిన్నప్పటి నుంచి పెరిగిన తనతో సహా అనేక మంది శిష్యులకు ఇది అత్యంత ప్రాధాన్యం గల కార్యక్రమమన్నారు. భారతీయ సంస్కృతి శాశ్వత వాహిని అనడానికి ఈ ఉత్సవం నిదర్శనమన్నారు. శ్రీ స్వామి నారాయణ వడ్తాల్ ధామాన్ని స్థాపించి 200 ఏళ్లు గడిచినప్పటికీ ఆధ్యాత్మిక చేతన సజీవంగా ఉందని.. ఆయన బోధనలతో నేటికీ తాదాత్మ్యం చెందగలమని శ్రీ మోదీ స్పష్టం చేశారు. మందిర 200వ వార్షికోత్సవం సందర్భంగా సాధువులు, అనుచరులందరికీ శ్రీ మోదీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రెండు వందల రూపాయల (200) వెండి నాణెంతోపాటు స్మారక చిహ్నంతో పోస్టల్ స్టాంపు విడుదల చేసిందని ప్రధానమంత్రి తెలిపారు. ఇవి భావి తరాల మదిలో ఈ గొప్ప సందర్భపు జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతాయన్నారు.

ఈ సంప్రదాయంతో స్వామి నారాయణ్ వ్యక్తిగత, ఆధ్యాత్మిక, సామాజిక సంబంధాలపై ఆయన అనుచరులందరికీ అవగాహన ఉందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశాభివృద్ధి కోసం అర్థవంతమైన చింతనతోపాటు.. సాధువుల దివ్య సాంగత్యాన్ని గతంలోనూ, ఇప్పుడూ తాను ఆస్వాదించానని ప్రధాని చెప్పారు. ఇతర కార్యక్రమాల కారణంగా తాను వ్యక్తిగతంగా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయినప్పటికీ, మానసికంగా తాను వడ్తాల్ ధామంలోనే ఉన్నానని ప్రధాని వ్యాఖ్యానించారు.

పవిత్రమైన సాధు సంప్రదాయం భారతదేశ ప్రత్యేకత అని, ప్రతీ క్లిష్ట సమయంలోనూ ఒక రుషో, సాధు సంతో, మహాత్ముడో ఎవరో ఒకరు ముందు నిలిచారని శ్రీ మోదీ అన్నారు. స్వామి నారాయణ్ కూడా అలాంటి సమయంలోనే వచ్చారన్నారు. వందల ఏళ్ల బానిసత్వంతో బలహీనపడి, దేశం ఆత్మ విశ్వాసం కోల్పోయిన సమయంలో దేశాన్ని ఆయన ముందుకు తీసుకెళ్లారని ప్రధాని చెప్పారు. స్వామి నారాయణ్ తోపాటు ఆ కాలపు సాధువులందరూ ఓ కొత్త ఆధ్యాత్మిక శక్తినివ్వడమే కాకుండా.. మన ఆత్మగౌరవాన్ని మేల్కొలిపారని, మన అస్తిత్వాన్ని పునరుజ్జీవింపజేశారని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ దిశగా శిక్షపత్రి, వచనామృతుల కృషి ఎంతో అసామాన్యమైనదని, వారి బోధనలను స్వీకరించి ముందుకు తీసుకెళ్లడం మనందరి కర్తవ్యమని ఉద్ఘాటించారు. మానవాళి సేవకు, నూతన శక నిర్మాణానికి విశేషమైన తోడ్పాటునందించి గొప్ప స్ఫూర్తిగా వడ్తాల్ ధామం నిలిచినందుకు సంతోషంగా ఉందని శ్రీ మోదీ అన్నారు. అదే వడ్తాల్ ధామం అణగారిన వర్గాల నుంచి సాగరం వంటి గొప్ప అనుచరులను అందించిందన్నారు. వడ్తాల్ ధామం నేడు ఎందరో పిల్లలకు ఆహారం, నివాసం, విద్యతోపాటు అనేక సేవలు అందిస్తోందని.. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రాజెక్టులు చేపడుతోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మహిళా విద్య వంటి కీలక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. పేదలకు సేవ, ఆధునికతను ? ఆధ్యాత్మికతను మేళవించి భారతీయ సంస్కృతిని పరిరక్షించేలా కొత్తతరాన్ని నిర్మించడం వంటి విశేష సేవలెన్నిటినో వడ్తాల్ ధామం అందిస్తోందని శ్రీ మోదీ వివరించారు. ఇక్కడి సాధువులు, భక్తులు ఎప్పుడూ తన అంచనాలను తప్పలేదని.. మెరుగైన భవిష్యత్తు కోసం పారిశుద్ధ్యం నుంచి పర్యావరణం వరకూ అనేక కార్యక్రమాలను చేపట్టారని శ్రీ మోదీ ప్రశంసించారు. దానిని వారు తమ బాధ్యతగా స్వీకరించి, మనస్ఫూర్తిగా ఆ సంకల్పాన్ని నెరవేర్చడంలో నిమగ్నమయ్యారన్నారు. స్వామి నారాయణ్ సంప్రదాయానికి చెందిన శిష్యులు 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో లక్షకు పైగా మొక్కలు నాటారని శ్రీ మోదీ తెలిపారు.

ప్రతి వ్యక్తి జీవితంలో ఒక లక్ష్యం ఉంటుందని, వారి జీవితాన్ని కూడా అది నిర్దేశిస్తుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ లక్ష్యం మన మనోవాక్కర్మలను ప్రభావితం చేస్తుందన్నారు. పరమార్థాన్ని గుర్తిస్తే జీవితం మొత్తం మార్పు వస్తుందన్నారు. ప్రతి యుగంలోనూ సాధు సంతులు ప్రజలకు తమ జీవిత లక్ష్యాన్ని తెలియజేశారని కొనియాడారు. మన సమాజానికి సాధుసంతులు, రుషుల విశేష సేవలను ప్రముఖంగా ప్రస్తావించిన శ్రీ మోదీ.. ఆ లక్ష్యాల కోసం మొత్తం సమాజం, దేశం ఏకమైతే అవి తప్పక నెరవేరుతాయన్నారు. అందుకు అనేక ఉదాహరణలున్నాయన్నారు. ధార్మిక సంస్థలు నేడు యువతకు బృహత్తరమైన దిశను నిర్దేశించాయని, అభివృద్ధి చెందిన భారతదేశమనే నిర్దేశిత లక్ష్యంతో దేశం మొత్తం ముందుకు వెళుతున్నదని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన భారతదేశ మనే ఈ పవిత్ర లక్ష్యాన్ని వడ్తాల్ సాధు సంతులు, స్వామి నారాయణ్ పరివారమంతా ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రీ మోదీ కోరారు. స్వాతంత్ర్యో ద్యమాన్ని ప్రస్తావిస్తూ – స్వాతంత్ర్య కాంక్ష, చేతన సమాజంలోని అన్ని వర్గాల ప్రజల్లోనూ శతాబ్దం పాటు స్ఫూర్తినిస్తూ నిలిచాయని.. ప్రజలు తమ స్వతంత్రతా లక్ష్యాన్ని, స్వప్నాలను, సంకల్పాన్ని ఒక్క రోజూ ఒక్కక్షణం కూడా విడిచిపెట్టలేదని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఉన్న తపన, చైతన్యం అభివృద్ధి చెందిన భారత్ కోసం140 కోట్ల మంది దేశ ప్రజలలో అనుక్షణం ఉండాలన్నారు. రాబోయే 25 సంవత్సరాలు అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా జీవించేలా, ప్రతి క్షణం దానితో మమేకమై ఉండేలా ప్రజలను ప్రేరేపించాలని సాధువులు, స్వామి నారాయణ్ అనుచరులను ఆయన కోరారు. ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాని అభ్యర్థించారు. స్వావలంబన సాధించడం అభివృద్ధి చెందిన భారత్ దిశగా తొలి అడుగు అని, దీన్ని సాధించడానికి బయటి వ్యక్తులు అవసరం లేదని, 140 కోట్ల మంది భారత పౌరులు ఈ దిశగా చొరవ తీసుకోవాలని కోరారు. స్థానికతను ప్రోత్సహించడం ద్వారా సహకరించాలని కార్యక్రమానికి హాజరైన స్వామి నారాయణ్ శిష్యులను శ్రీ మోదీ కోరారు. అభివృద్ధి చెందిన భారత్ కోసం దేశ ఐక్యత, సమగ్రత అత్యంత ప్రధానమైనవని స్పష్టం చేసిన శ్రీ మోదీ.. కొన్ని స్వార్థ శక్తులు సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యలను ఐక్యంగా తిప్పికొట్టడం అత్యావశ్యకమన్నారు.

కఠోర సాధన ద్వారా పెద్ద లక్ష్యాలను ఎలా సాధించవచ్చో, దేశ నిర్మాణం దిశగా యువత నిర్ణయాత్మకంగా ఎలా నిర్దేశించగలదో, యువత దేశాన్ని ఎలా నిర్మించగలదో ? ఎలా నిర్మిస్తుందో అన్న అంశాలపై శ్రీ స్వామి నారాయణ్ బోధనలను శ్రీ మోదీ ప్రముఖంగా పేర్కొన్నారు. ఇందుకోసం యువతను సమర్థులుగా, విద్యావంతులుగా తీర్చిదిద్దడం అవసరం. సాధికారత, నైపుణ్యం కలిగిన యువత అభివృద్ధి చెందిన భారతదేశం దిశగా నడిపించగల అతిపెద్ద శక్తి అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. భారత యువతకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ మరింత పెరుగుతుందన్నారు. భారత్ లోని నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉందని, దేశ యువశక్తి ప్రపంచాన్ని ఆకట్టుకున్నదని ప్రధానమంత్రి చెప్పారు. దేశంతోపాటు ప్రపంచ అవసరాలను కూడా తీర్చడానికి ఈ యువత సంసిద్ధంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. వ్యసనాల నుంచి విముక్తి కల్పించడానికి స్వామి నారాయణ్ భక్తులు చేస్తున్న కృషిని ప్రముఖంగా పేర్కొంటూ.. యువత వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా సాధువులు, స్వామి అనుచరులు కృషిచేయాలని శ్రీ మోదీ కోరారు. మాదకద్రవ్యాల వ్యసనం నుంచి యువతను రక్షించే కార్యక్రమాలు కేవలం భారత్ లోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా కూడా అత్యావశ్యకమని ఆయన అన్నారు. అలాంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలన్నారు.

ఏ దేశమైనా ఘనమైన తన వారసత్వ సంపదను గౌరవించి, సంరక్షిస్తేనే పురోగతి సాధించగలదన్న శ్రీ మోదీ.. "అభివృద్ధితోపాటు వారసత్వ సంపదను పరిరక్షించడం భారత్ కు మంత్రప్రదం" అన్నారు. అయోధ్యను ప్రస్తావిస్తూ.. వేల ఏళ్ల నాటి భారత వారసత్వ కేంద్రాల వైభవం పునరుద్ధరణకు నోచుకుంటుండడంపై శ్రీ మోదీ హర్షం వ్యక్తం చేశారు. గతంలో వాటిని ధ్వంసమైన ప్రదేశాలుగానే భావించారన్నారు. కాశి, కేదారనాథ్, పావగఢ్, మొథెరా సూర్యదేవాలయం, సోమనాథ ఆలయాలను కూడా ఈ పరివర్తనకు నిదర్శనాలుగా ఆయన ఉదాహరించారు. అంతటా సరికొత్త చైతన్యం, సంకల్పం కనిపిస్తున్నాయన్నారు. చోరీకి గురైన వందల ఏళ్ల నాటి దేవతా విగ్రహాలు భారత్‌కు తిరిగి వస్తున్నాయని కూడా శ్రీ మోదీ పేర్కొన్నారు. లోథాల్ పునరాభివృద్ధి ప్రాజెక్టును ప్రస్తావిస్తూ.. సాంస్కృతిక చైతన్య ప్రసరణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదన్నారు. ఈ నేలను, ఈ దేశాన్ని, ఇక్కడి సంప్రదాయాలను ప్రేమించే, ఈ సంస్కృతిపై గర్వించే, మన వారసత్వాన్ని కీర్తించే పౌరులందరిపైనా ఈ బాధ్యత ఉందన్నారు. వడ్తాల్ ధామంలోని స్వామి నారాయణ్ కళాఖండాల ప్రదర్శన శాల అక్షర్ భువన్ కూడా ఇందులో భాగమే అని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన శ్రీ మోదీ.. అక్షర్ భువన్ దేశ అజరామరమైన ఆధ్యాత్మిక వారసత్వానికి గొప్ప దేవాలయంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

140 కోట్ల మంది భారతీయులు ఉమ్మడి లక్ష్యం కోసం ఏకమైనప్పుడే అభివృద్ధి చెందిన భారత్ సాకారమవుతుందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ ప్రస్థానాన్ని పూర్తి చేయడంలో మన సాధు సంతుల మార్గదర్శకత్వం చాలా ముఖ్యమైనదన్నారు. 12 ఏళ్లకోసారి జరిగే భారత సాంస్కృతిక దీప్తి అయిన పూర్ణ కుంభ గురించి ప్రపంచానికి చాటాలని ఈ సందర్భంగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన సాధువులను ప్రధానమంత్రి అభ్యర్థించారు. ప్రయాగరాజ్ లో జరగబోయే పూర్ణ కుంభ గురించి ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, భారత మూలాలు లేని విదేశీయులకు దాని గురించి వివరించాలని ఆయన సూచించారు. విదేశాల్లోని తమ ప్రతి శాఖ నుంచి కనీసం 100 మంది విదేశీయులు... వచ్చే కుంభమేళాను సందర్శించడానికి ప్రయత్నించాలని ఆయన కోరారు. ప్రపంచం మొత్తానికీ దీనిపై అవగాహన కల్పించే ఈ కార్యాన్ని సాధువులు సులభంగా పూర్తి చేయగలరని ప్రధాని అన్నారు.

కార్యక్రమానికి వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయినందుకు క్షమాపణలు చెప్తూ, ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా స్వామి నారాయణ మందిరంలోని సాధువులు, అనుచరులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ శ్రీ మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.

గుజరాత్ లోని వడ్తాల్ లో ఉన్న శ్రీ స్వామినారాయణ్ మందిరం 200వ వార్షిక వేడుకల్లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. శ్రీ స్వామినారాయణ్ మందిరం అనేక దశాబ్దాలుగా ప్రజల సామాజిక, ఆధ్యాత్మిక జీవనాన్ని ప్రభావితం చేస్తోంది.

# భార్య గొంతు కోసి హత్య చేసి అనంతరం మృతదేహాన్ని తగులబెట్టిన భర్త

హైదరాబాద్ నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: హైదరాబాద్ లోని పాతబస్తీ బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యను భర్త హత్య చేశాడు. హస్మా బాద్ ఖాద్రియా మసీద్ వద్ద భార్య గొంతు కోసి అనంతరం మృతదేహాన్ని భర్త తగులబెట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడలో ఫైజ్ ఖురేషి (28) ఆటోను నడిపిస్తూ జీవనం సాగిస్తు న్నాడు. ఆరు సంవత్సరాల క్రియంతో పిసల్ బండాకు చెందిన ఖమర్ బేగమ్(24) ను వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో కత్తితో భార్య గొంతు కోసి అనంతరం మృతదేహాన్ని తగలబెట్టాడు. బండ్లగూడ పోలీస్ స్టేషన్ లో భర్త లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# సీనియర్ వేధించడంతోనే స్వాతిప్రియ ఆత్మహత్య..

## – మృతురాలి సోదరుడు భజరంగ్ ఆరోపణలు

హైదరాబాద్ నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సీనియర్ విద్యార్థి వేధింపుల వల్లే తన సోదరి చనిపోయిందని మృతురాలి సోదరుడు భజరంగ్ ఆరోపణలు చేశారు. ట్రిపుల్ ఐటి విద్యార్థిని స్వాతి ప్రియ ఆత్మహత్యపై ఆమె సోదరుడు భజరంగ్ స్పందించారు. తన సోదరిని సీనియర్ విద్యార్థి వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకుందన్నారు. ఓ సీనియర్ విద్యార్థి రోజు ఫోన్ చేసి వేధింపులకు గురిచేసే వాడని, ఇంఛార్జ్ ప్రిన్సిపల్, వార్డెన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. బాసర ట్రిపుల్ ఐటిలో ట్రిపుల్ పియుసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియ హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు నిజామాబాద్ జిలా ఆర్మూర్ మండల కేంద్రంలోని తిరుమల కాలనీకి చెందిన ఆమె అని అధికారులు వెల్లడించారు.

# ఖర్గే గారు ఒకసారి తెలంగాణ వచ్చి చూడండి..

## – కాంగ్రెస్ చీఫ్ మల్లిఖాచూడంచేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ సెటైర్స్

హైదరాబాద్ నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అణిచివేసేందుకు, ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేందుకు ప్రధాని మోదీ ఎమ్మెల్యేలను గొర్రెలు కొన్నట్లు కొంటున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఖర్గే ఒకసారి తెలంగాణ వచ్చి చూస్తే.. ఇక్కడ గొర్రెల వ్యాపారం ఎంత బాగా నడుస్తుందో చూసి ఆశ్చర్యపోతారని విమర్శించారు. అతి పెద్ద గొర్రెల కొనుగోలుదారుడిని అందించినందుకు కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు అంటూ వ్యంగ్యంగా చెప్పారు. బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకున్నారని కేటీఆర్ అన్నారు. వాళ్లలో కొందర్ని కొనుగోలు చేశారని.. మరికొందరిని బెదిరించారని తెలిపారు. కానీ అలా పార్టీ మారిన ఎవరూ కూడా తమ పదవికి రాజీనామా చేయాలని పేర్కొన్నారు. ఆ 10 మంది ఎమ్మెల్యేలు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో వారికి కూడా తెలియని దయనీయ పరిస్థితి ఉందని విమర్శించారు. వారిని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో నిలబెట్టి దీనిపై అడగాలని ఖర్గేను డిమాండ్ చేశారు. వాళ్లందరూ కూడా కోర్టులకు, తమ పదవి పోతుందేమోనని గజగజ వణికిపోతున్నారని తెలిపారు. సోమవారం నాడు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లిఖార్జున ఖర్గే ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. విపక్షాలను అణిచివేసేందుకు, ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేందుకు ఎమ్మెల్యే గొర్రెలను కొన్నట్లుగా కొంటున్నారని ఆరోపించారు. నలుగురు వ్యక్తులు ( మోదీ, అమిత్‌షా, అదానీ, అంబానీ) నలుగురు కలిసి దేశాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. మోదీ అబద్దాల కోరు అని.. తన వాగ్దానాలను ఎప్పుడూ నెరవేర్చలేదని అన్నారు.

# సర్వేలో వ్యక్తిగత వివరాలు చెప్పాల్సిన అవసరం లేదు : తమ్మినేని వీరభద్రం

వరంగల్, నవంబర్ 12: సమగ్ర ఇంటింటి సర్వేలో వ్యక్తిగత వివరాలు చెప్పాల్సిన అవసరం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం గార్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల గణన కోసమే సర్వే చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తున్నదని, మైనార్టీ నాయకులను అణిచివేస్తున్నదని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలకు మొండి చేయి చూపిస్తున్నదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఎప్పుడో అమలు చేస్తారో కాంగ్రెస్ పార్టీకే తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు హామీ ఇచ్చిన రైతు భరోసా, రూ. రెండు లక్షల రుణమాఫీ కూడా చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఏ మంత్రి ఏం మాట్లాడుతారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని తమ్మినేని అన్నారు.

# పత్తి కొనుగోలుకు సీసీఐ కండిషన్స్.. టార్గెట్ అయిపోయిందంటూ గేటుకు తాళం

నల్గొండ, నవంబర్ 12:పత్తి పంటను ఎటాంటి టార్గెట్ లేకుండా సీసీఐ అధికారులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని పత్తి రైతులు మంగళవారం సాయంత్రం యరగండ్లపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి కాటన్‌మిల్లు దగ్గర రాస్తారోకో చేశారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వరసగా మూడు రోజుల నుంచి పత్తి కొనుగోళ్లు జరగలేదని, తిండి తిప్పలు లేకుండా సీసీఐ కేంద్రం వద్ద పడిగాపులు గాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి వరకు తేమశాతం పేరుతో అధికారులు పత్తిని కొనకుండా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు.

ఇప్పుడేమో రోజుకు 1200 నుంచి 1500 క్వింటాళ్ల వరకే కొంటామని చెప్పి టార్గెట్ అయిపోయిందంటూ గేటుకు తాళం వేస్తున్నారని వాపోయారు.

పత్తిని తీసుకొచ్చిన వాహనాలకు వెయిటింగ్ ఛార్జీ పడటమే కాకుండా తేమశాతం కూడా పెరిగి తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు.

సీసీఐ అధికారులు నిబంధనలు లేకుండా పత్తిని కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. వందల మంది రైతులు రాస్తారోకో చేయడంతో వాహనాలు భారీగా నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు.



# సంగారెడ్డి జిల్లాకు..ఎనభై ఫీట్లుగా ఆల్విన్ బైపాస్‌రోడ్డు విస్తరణ

**-రూ.12 కోట్లు మంజూరు చేయించిన జగ్గారెడ్డి**
**-బసవేశ్వర, శివాజీ, అంబేద్కర్, మహాత్మగాంధీ, నెహ్రూ, రాజీవ్‌గాంధీల పేరిట ఆరుచోట్ల జంక్షన్లు**
**-2.5కి.మీలు పాదయాత్ర చేసి పరిశీలించిన జగ్గారెడ్డి**
**- ప్రజలు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని అన్ని శాఖల అధికారులకు జగ్గారెడ్డి ఆదేశం**




సంగారెడ్డి, నవంబరు12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:ఎనభై ఫీట్లుగా సంగారెడ్డి పట్టణంలోని అల్విన్ బైపాస్‌రోడ్డును విస్తరించడానికి రూ.12 కోట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విడుదల చేయించారు. ఐబీ గెస్ట్‌హౌజ్ నుండి నేషనల్ హైవే సమీపంలోని గుర్రపు బొమ్మ వరకు 2.5 కిలోమీటర్లు ఈ రహదారిని విస్తరించే క్రమంలో మంగళవారం జగ్గారెడ్డి సమీక్షించారు. మున్సిపల్, ఆర్అండ్‌బి, ఎలక్ట్రిసిటీ, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి బైపాస్ రోడ్డులో పర్యటించారు. రోడ్డు మధ్యలో సింగిల్ స్టోన్‌తో డివైడర్ ఏర్పాటు చేయాలని, ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. రహదారి విస్తరణలో భాగంగా డబ్బాలను తాత్కాలికంగా తొలగించి, పనులు పూర్తికాగానే అదే చోట మళ్లీ డబ్బాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. 2.5కి.మీలు జగ్గారెడ్డి పాదయాత్ర చేస్తూ వ్యాపారులు, ప్రజల సలహాలు స్వీకరించారు. రహదారి విస్తరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి చెప్పారు. కాగా ఐబీగెస్ట్ నుండి గుర్రపు బొమ్మ వరకు ఆరుచోట్ల జంక్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బసవేశ్వర, శివాజీ, అంబేద్కర్, మహాత్మగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీల పేరిట ఈ జంక్షన్లు ఉండాలన్నారు.

# విద్యుత్ ఉత్పత్తిలో బ్లెండింగ్ ప్రయోజనాల కోసం బొగ్గు దిగుమతి ఏప్రిల్ - సెప్టెంబర్ 2024లో 8.5% తగ్గింది

న్యూఢిల్లీ, నవంబర్ 12:ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద బొగ్గు నిల్వలను కలిగి ఉన్న భారతదేశం, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతో నడిచే రెండవ అతిపెద్ద బొగ్గు వినియోగదారుగా నిలిచింది. అయితే, ప్రస్తుత వినియోగ ప్రకృతి దృశ్యం దిగుమతులకు, ముఖ్యంగా కోకింగ్ బొగ్గు మరియు హై-గ్రేడ్ థర్మల్ బొగ్గు కోసం క్లిష్టమైన అవసరాన్ని వెల్లడిస్తుంది, ఇవి దేశీయ నిల్వలలో తగినంతగా అందుబాటులో లేవు. ఈ కొరత ఉక్కుతో సహా కీలక పరిశ్రమలకు మద్దతు ఇవ్వడానికి దిగుమతులు అవసరం.

ఈజ 2024-25 ఏప్రిల్-ఆగస్టు కాలంలో బొగ్గు దిగుమతులు 2.2% స్వల్ప పెరుగుదలను చవిచూశాయి, మునుపటి సంవత్సరంలో 108.81 ఓతో పోలిస్తే 111.20 మిలియన్ టన్నులకు (ఓ) చేరుకుంది. ఏది ఏమైనప్పటికీ, గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఏప్రిల్-ఆగస్టు'24లో నియంత్రణ లేని రంగం 10.3% గణనీయమైన క్షీణతను చవిచూసింది. (డేటా మూలం: ఆఉఅమో).

గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఏప్రిల్ 2024 నుండి సెప్టెంబరు 2024 వరకు బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిలో 4.97% గణనీయమైన వృద్ధి ఉన్నప్పటికీ, బ్లెండింగ్ ప్రయోజనాల కోసం దిగుమతులు గత సంవత్సరంతో పోలిస్తే 9.79 ఓకి తగ్గాయి, ఇది 10.70 ఓ, ఇది 8.5% క్షీణతను సూచిస్తుంది. అదే కాలం.

ఈ క్షీణత బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడానికి మరియు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి భారతదేశం యొక్క స్థిరమైన నిబద్ధతను నొక్కి చెబుతుంది. దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్ల (దిగుమతి చేసిన బొగ్గును మాత్రమే వినియోగించుకునేలా రూపొందించబడింది) ద్వారా బొగ్గును దిగుమతి చేసుకోవడం వల్ల విద్యుత్ రంగానికి బొగ్గు దిగుమతుల పెరుగుదల కారణమని చెప్పవచ్చు, అంటే ఈ కాలంలో 26.14 ఎంటి, ఇది 17.07 ఎంటి నుండి, 53.1% వృద్ధికి చేరుకుంది. గత సంవత్సరం కాలపరిమితి.

అంతే కాకుండా, ఏప్రిల్-సెప్టెంబర్ 2024 కాలంలో బొగ్గు ఉత్పత్తి ప్రశంసనీయమైన పెరుగుదలను ప్రదర్శించింది, 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 428.21 ఎంటి తో పోలిస్తే 453 ఎంటికి చేరుకుంది, ఇది 5.79% వృద్ధిని సూచిస్తుంది. బొగ్గు వినియోగాన్ని క్రమబద్ధీకరించడానికి మరియు దేశీయ ఉత్పత్తిని పెంపొందించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఈ పెరుగుదల ధోరణి ప్రతిబింబిస్తుంది.

అయితే, విలువ పరంగా, ఏప్రిల్-ఆగస్టు 2024-25లో మొత్తం దిగుమతి చేసుకున్న బొగ్గు ధర రూ. 120,532.21 కోట్లు గత సంవత్సరం (2023-24) ఇదే కాలంలో మొత్తం దిగుమతి చేసుకున్న బొగ్గు ధర రూ. 133,461.65 కోట్లు దీని వల్ల రూ. 12,929.44 కోట్లు ., ఇది గత సంవత్సరంతో పోలిస్తే విలువ పరంగా సుమారు 9.69% ఆదా అవుతుంది.

బొగ్గు మంత్రిత్వ శాఖ బొగ్గు ఉత్పత్తిని పెంచడం మరియు లభ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా వ్యూహాత్మక కార్యక్రమాలను అమలు చేస్తూనే ఉంది. ఈ ప్రయత్నాలు కేవలం విదేశీ మారకద్రవ్య నిల్వలను కాపాడుకోవడంపైనే కాకుండా దేశ ఇంధన భద్రతను పెంపొందించడంపై దృష్టి సారించాయి. దేశీయ బొగ్గు ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న చురుకైన చర్యలు అంతిమంగా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి మరియు భారతదేశ ఇంధన ప్రకృతి దృశ్యం యొక్క మొత్తం స్థిరత్వానికి దోహదం చేస్తాయి.

# పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు మరియు ఇండస్ట్రియల్ డిజైన్‌లలో భారతదేశం టాప్ 10 దేశాలలో స్థానం సంపాదించింది: WIPO 2024 నివేదిక

న్యూఢిల్లీ, నవంబర్ 12:ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (విఐఖూ) ప్రపంచ మేధో సంపత్తి సూచికలు (విఖఐ) 2024ను ప్రచురించింది, మేధో సంపత్తి (ఎఖ) ఫైలింగ్‌లలో ప్రపంచ పోకడలను నొక్కి చెబుతుంది. అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో పేటెంట్, ట్రేడ్‌మార్క్ మరియు ఇండస్ట్రియల్ డిజైన్ అప్లికేషన్‌లలో గణనీయమైన వృద్ధిని నివేదిక వెల్లడించింది.

మూడు ప్రధాన మేధో సంపత్తి (ఎఖ) హక్కులు-పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు మరియు పారిశ్రామిక డిజైన్‌ల కోసం భారతదేశం గ్లోబల్ టాప్ 10లో ఒక స్థానాన్ని సంపాదించుకుంది.

భారతదేశం మేధో సంపత్తి (ఎఖ) ల్యాండ్‌స్కేప్‌లో గ్లోబల్ లీడర్‌గా తన స్థానాన్ని పదిలపరుచుకుంటూ ఉంది. ఎఖ కార్యాచరణలో పురోగతి మరియు కొత్త మైలురాళ్లను గుర్తించడం.

భారతదేశం 2023లో పేటెంట్ (+15.7%) అప్లికేషన్‌లలో టాప్ 20 మూలాల్లో అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసింది, ఇది వరుసగా ఐదవ సంవత్సరం రెండంకెల వృద్ధిని సూచిస్తుంది. భారతదేశం 64,480 దరఖాస్తులతో పేటెంట్‌ల కోసం ప్రపంచవ్యాప్తంగా ఆరవ స్థానంలో ఉంది, రెసిడెంట్ ఫైలింగ్‌లు మొత్తం సమర్పణలలో సగానికి పైగా (55.2%) ఉన్నాయి-ఇది దేశానికి మొదటిది. పేటెంట్ కార్యాలయం మునుపటి సంవత్సరంతో పోలిస్తే 2023లో 149.4% ఎక్కువ పేటెంట్లను మంజూరు చేసింది, ఇది దేశం యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎఖ పర్యావరణ వ్యవస్థను నొక్కి చెబుతుంది.

భారతదేశంలోని ఉత్పత్తి రూపకల్పన, తయారీ మరియు సృజనాత్మక పరిశ్రమలపై పెరుగుతున్న ప్రాధాన్యతతో సమలేఖనం చేయబడిన భారతదేశ పారిశ్రామిక డిజైన్ అప్లికేషన్‌లలో స్థిరమైన పెరుగుదల (36.4%) ఉన్నట్లు నివేదిక సూచిస్తుంది. మొదటి మూడు విభాగాలు -వస్త్రాలు మరియు ఉపకరణాలు, ఉపకరణాలు మరియు యంత్రాలు మరియు ఆరోగ్యం మరియు సౌందర్య సాధనాలు-అన్ని డిజైన్ ఫైలింగ్‌లలో దాదాపు సగం వరకు ఉన్నాయి,


2018 మరియు 2023 మధ్య, పేటెంట్ మరియు ఇండస్ట్రియల్ డిజైన్ అప్లికేషన్‌లు రెట్టింపు కంటే ఎక్కువ పెరిగాయి, అయితే ట్రేడ్‌మార్క్ ఫైలింగ్‌లు 60% పెరిగాయి, ఇది ఎఖ మరియు ఆవిష్కరణలపై దేశం యొక్క పెరుగుతున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది. భారతదేశం యొక్క పేటెంట్-టు-జిడిపి నిష్పత్తి కూడా గణనీయమైన వృద్ధిని సాధించింది, గత దశాబ్దంలో 144 నుండి 381కి పెరిగింది, ఆర్థిక విస్తరణతో పాటుగా ఎఖ కార్యాచరణ కూడా పెరుగుతోందని సూచిస్తుంది.

2023లో 6.1% పెరుగుదలతో భారతదేశం ట్రేడ్‌మార్క్ ఫైలింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా నాల్గవ స్థానంలో ఉంది.

ఈ ఫైలింగ్‌లలో దాదాపు 90% నివాసితులు, ఆరోగ్యం (21.9%), వ్యవసాయం (15.3%), మరియు దుస్తులు (12.8%) వంటి కీలక రంగాలు అగ్రగామిగా ఉన్నాయి. మార్గం. భారతదేశం యొక్క ట్రేడ్‌మార్క్ కార్యాలయం ప్రపంచవ్యాప్త బ్రాండ్ రక్షణలో దేశం యొక్క బలమైన స్థానాన్ని ప్రతిబింబిస్తూ 3.2 మిలియన్లకు పైగా ట్రేడ్‌మార్క్‌లతో ప్రపంచవ్యాప్తంగా రెండవ అతిపెద్ద క్రియాశీల రిజిస్ట్రేషన్‌లను కలిగి ఉంది.

ఆర్థిక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ ఆవిష్కరణల పునరుద్ధరణను ప్రతిబింబిస్తూ, ప్రపంచ మేధో సంపత్తి (ఎఖ) ఫైలింగ్‌లలో నిరంతర వృద్ధిని నివేదిక హైలైట్ చేస్తుంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా దాఖలైన 3.55 మిలియన్ల పేటెంట్ దరఖాస్తుల రికార్డును ముఖ్య పరిశోధనలు చూపిస్తున్నాయి, ఇది 2022 కంటే 2.7% పెరిగింది,

ఆసియాలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థల నుండి చెప్పుకోదగ్గ సహకారం అందించబడింది. ఈ పెరుగుదల ఎక్కువగా చైనా, యునైటెడ్ స్టేట్స్, జపాన్, దక్షిణ కొరియా మరియు భారతదేశంలోని నివాసితులచే నడపబడింది. ఈ వృద్ధి ధోరణి, ప్రత్యేకించి రెసిడెంట్ ఫైలింగ్‌లలో, అనేక దేశాలు తమ దేశీయ ఎఖ ల్యాండ్‌స్కేప్‌లను బలోపేతం చేసే లక్ష్యంతో స్థానిక ఆవిష్కరణల వైపు మొగ్గు చూపుతుంది.




# జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం..

**-విచారణ మరో ధర్మాసనానికి బదిలీ**

అమరావతి నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వైసీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది.

అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ రద్దు చేయాలని, కేసు విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి మార్చాలని కోరుతూ మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది.

విచారణ ప్రారంభం కాగానే పిటిషన్ ఏపీకి చెందిందని జగన్ తరుపు న్యాయవాది బెంచ్‌కు చెప్పారు. మారిన పరిస్థితుల్లో కౌంటర్ దాఖలుకు కొంత సమయం కావాలని సీబీఐ తరుపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. అయితే స్పందించిన జస్టిస్ సంజయ్‌కుమార్ 'నాట్ బీఫోర్ మీ' అనడంతో పిటిషన్లు మరో ధర్మాసనానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా కేసును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వం వహించే ధర్మాసనం ముందుకు పంపాలని ఆదేశాలు జారీ చేస్తూ డిసెంబర్ 2న విచారణకు పంపాలని రిజిస్ట్రీకి ఆదేశించారు.

# సభలో ప్రతిపక్షం లేదు.. మనకేం అని నిర్లక్ష్యంగా ఉండొద్దు

**-వాళ్లకు బాధ్యత లేదు కానీ.. మనకు బాధ్యత ఉంది**
**-కూటమి ఎమ్మెల్యేలకు సూచించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు**

అమరావతి నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సభలో ప్రతిపక్షం లేదు కదా.. మనకేం ఉందని నిర్లక్ష్యంగా ఉండొద్దని కూటమి ఎమ్మెల్యేలకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. వాళ్లకు బాధ్యత లేదు కానీ.. మనకు ఉందని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దామని సూచించారు. ఎమ్మెల్యేలకు సబ్జెక్ట్ నేర్చుకోవాలనే ఆసక్తి తగ్గిపోతుందని చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేలు నిరంతరం నేర్చుకోవాలని, తెలుసుకోవాలని సూచించారు. బడ్జెట్ సమావేశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలిపారు. ప్రభుత్వం తెచ్చే బిల్లులు, పాలసీలపై అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంతో పాటు కేంద్ర బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులపై ఎమ్మెల్యేలు స్టడీ చేయాలని సూచించారు. పబ్లిక్ గవర్నెన్స్‌లో ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉండాలని చెప్పారు. విజన్ 2047పై అందరి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. పనిచేయాలనే ఆసక్తి ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలకు ఏం అవసరం.. మనం ఏం చేశామనేది చెప్పడానికి అసెంబ్లీ ఒక వేదిక అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అసెంబ్లీలో తమ ప్రతినిధి మాట్లాడుతున్నారని ప్రజలు గమనిస్తూనే ఉంటారని తెలిపారు. అలాంటప్పుడు బూతులు మాట్లాడితే ప్రజలు స్వాగతించరని చెప్పారు.

# అసెంబ్లీకి వెళ్లలేని ఎమ్మెల్యేలు తక్షణమే పదవులకు రాజీనామా చేయాలి

**-వైసీపీ అధినేతకు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఘాటుకు వైఎస్ షర్మిల లేఖ**

అమరావతి నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వైసీపీ అధినేతకు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఘాటుకు లేఖ రాశారు. అసెంబ్లీకి వెళ్లలేని ఎమ్మెల్యేలు తక్షణమే పదవులకు రాజీనామా చేయాలని మంగళవారం విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిమాండ్ చేస్తూ లేఖను విడుదల చేశారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలను గమనించే ప్రజలు 11 సీట్లు ఇచ్చారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి వెళ్లనని జగన్ చెబుతున్నారు. స్వయంకృతాపరాధమేతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని గుర్తించాలని సూచించారు. వైసీపీకి 11 సీట్లు ఇచ్చిన కృతజ్ఞతనైనా ఉండాలి కదా అంటూ నిలదీశారు. అసెంబ్లీకి వెళ్లనని జగన్ అహంకారం, అజ్ఞానం బయట పడుతుందని ఆరోపించారు. బయట మాట్లాడుతాం. ఇంట్లో కూర్చుని మాట్లాడటం అంటే సరిపోదని , అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని వైసీపీ ఎమ్మెల్యేలకు సూచించారు. అసెంబ్లీ పోవడానికి ధైర్యం లేదా. సామర్థ్యం లేదా జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి పోటీకి నిలబడితే అసెంబ్లీకి వెళ్లమని , గెలిపించినా అసెంబ్లీకి వెళ్లబోమని ప్రజల నుంచి రిఫరెండం తీసుకోవా లని అన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. అసెంబ్లీకి వెళ్లకపోతే ప్రజలను మోసం చేయడం కాదా అంటూ ప్రశ్నించారు. నేడు అసెంబ్లీలో మాట్లాడేవారే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో ఆయా వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని, కేటాయింపులపై అడిగే బాధ్యత వైసీపీ ఎమ్మెల్యేలకు ఉందని గుర్తు చేశారు.

# కరెన్సీ విలువ 8-10 శాతం తగ్గొచ్చని ఎస్బీఐ అంచనా

**- ఇప్పటికే జీవనకాల కనిష్ఠానికి క్షీణించిన రుపాయి**
**-డాలర్‌తో పోల్చితే మారకపు రేటు 84.38 వద్దకు పతనం**

న్యూఢిల్లీ, నవంబర్ 12: వచ్చే నాలుగేండ్లలో రూపాయి మారకం విలువ 8-10 శాతం పడిపోవచ్చని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ అంచనా వేస్తున్నది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో తాజాగా ఎస్బీఐ ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో ట్రంప్ హయాంలో డాలర్‌తో పోల్చితే రుపీ మారకపు రేటు మరో రూ.10దాకా క్షీణించవచ్చని అభిప్రాయపడటం గమనార్హం. '2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలు: భారత్, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ 2.0 ప్రభావమెంత?' అన్న శీర్షికతో ఈ రిపోర్టు వచ్చింది.


ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠమెక్కితే భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఉండవచ్చని ఎస్బీఐ విశ్లేషిస్తున్నది. ముందుగా దేశానికి ఎదురయ్యే సవాళ్ల విషయానికొస్తే.. అమెరికాకు భారత్ నుంచి వెళ్లే ఎగుమతులపై టారీఫ్‌లు పెరగవచ్చని, హెచ్-1బీ వీసాలపై కొత్తగా ఆంక్షలు రావచ్చని, ఫారెక్స్ మార్కెట్‌లో ఒడిదొడుకులకు ఆస్కారం ఉండొచ్చని అంటున్నది. ఈ క్రమంలోనే డాలర్ విలువ మరింత బలోపేతమై రూపాయి మారకం విలువ పతనం కావచ్చని అంచనా వేస్తున్నది. ఇందులో భాగంగానే 8-10 శాతం మేర రుపీ నష్టపోవచ్చని హెచ్చరిస్తున్నది. అయితే భారతీయ తయారీ రంగానికి ప్రోత్సాహకాలు లభించవచ్చని, కొత్త మార్కెట్లకు ఎగుమతులు విస్తరించే వీలుందని, ఆర్థిక స్వావలంబన పెరగవచ్చని కూడా చెప్తున్నది. కాగా అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి ఎన్నికైనప్పుడూ రూపాయి విలువ దారుణంగా దెబ్బతిన్నదని ఎస్బీఐ ఈ సందర్భంగా గుర్తుచేసింది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌కు ముందు అధికారంలో ఉన్న ట్రంప్ హయాం లో డాలర్‌తో రుపీ మారకపు రేటు 11 శాతం పతనమైందని చెప్పింది. అయితే జో బైడెన్ హయాంలో కంటే ఇది తక్కువేనని కూడా పేర్కొన్నది. హెచ్-1బీ వీసాల నిబంధనల్ని కఠినతరం చేస్తే ఐటీ, దాని అనుబంధ రంగాల సంస్థలపై ఖర్చుల భారం పెరుగుతుందని కూడా చెప్తున్నది. దీనివల్ల అమెరికా కార్యకలాపాల కోసం ఇక్కడివారిని ఉద్యోగాల్లోకి తీసుకోలేకపోవచ్చని, దేశీయ నియామకాలపై ఇది ప్రభావం చూపవచ్చని కూడా విశ్లేషించింది.

# చాగంటి కోటేశ్వరరావును టీటీడీ నైతిక సలహాదారుగా నియమించడం హర్షణీయం

**- మాతృదేవోభవ సత్సంగ జాతీయ ప్రధాన కార్యదర్శి శివలెంక నాగ ఉదయ లక్ష్మి**


మేడ్చల్ నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కీసర మండలంలో శ్రీరామలింగేశ్వర్ కాలనీ మాతృదేవోభవ సత్సంగ కార్యాలయంలో సత్సంగం కార్యక్రమం మాతృదేవోభవ సత్సంగ జాతీయ ప్రధాన కార్యదర్శి శివలెంక నాగ ఉదయ లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మాతృదేవోభవ సత్సంగ జాతీయ అధ్యక్షుడు శ్రీ కే,బి శ్రీ ధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మా సంస్థ ప్రజల్లో మాతృభక్తి గురుంచి అవగాహన కార్యక్రమాలు చెబడుతోందని వృద్ధులైన మాతృమూర్తులందరికి సేవలందించే దృక్పదం లో వున్నానని తెలిపారు. ఆధ్యాత్మిక.నైతిక.విలువలు కాపాడటానికి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు నైతిక సలహాదారుగా టీటీడీ లో నియమించడం సంతోషమని వారికి శుభాకాంక్షలు తెలియచేసారు. మాతృదేవోభవ సత్సంగ జాతీయ ప్రధాన కార్యదర్శి శివలెంక నాగ ఉదయ లక్ష్మి తన అభిప్రాయాన్ని తెలియ చేస్తూ ప్రఖ్యాత ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వర రావు గారిని టీటీడీ నైతిక సలహాదారుగా నియమించడం హర్షణీయం అన్నారు. ప్రస్తుత సమాజంలో నైతిక విలువలను కాపాడుకోవడం చాల అవసరమని.ఒక్క.విద్యార్థులకే కాదు అన్ని..వయస్సుల వారికి కూడ అవసరం అని అన్నారు. అన్ని ఆధ్యాత్మిక సంస్థలు కూడ చాగంటి వారికి సహకరించే.దిశలో.వుండాలి అన్నారు. అందుకు టీటీడీ యాజమాన్యం ప్రభుత్వం తప్పక సంఘాలతో.కూడి తిరుమల వైభవాన్ని మరింతగా.ముందుకు తీసుకుని సాగుతుందని ఉదయ లక్ష్మి అన్నారు. మాతృదేవోభవ అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తుందని. తమవంతు కృషిగా సహరిస్తామని.చెప్పారు. టీటీడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నమని అన్నారు ఈ సభలో సభ్యులు డాక్టర్ అంజనీ దేవి.వీరాంజనేయులు సరిత సంస్థ రాజు నాగేందర్ పలువురు పాల్గొన్నారు

# గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తిని సన్మానించిన కర్రి వేణుమాధవ్



విజయవాడ నవంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతనంగా ఆంధ్రప్రదేశ్ గౌడ కార్పొరేషన్ తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తిని ఆంధ్రప్రదేశ్ గౌడ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించిన సందర్భంగా మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఢిల్లీ వ్యవహారాల ఇంచార్జ్ బీసీ ఫైర్ బ్రాండ్ లీడర్ కర్రి వేణుమాధవ్ ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురుమూర్తిని బీసీ నాయకులతో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎన్నో సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి తన విలువైన సేవలు అందిస్తున్న గురుమూర్తిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు గౌడ కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వడం అభినందనలు తెలేపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తోలేటి సురేష్ పిళ్ళా దినేష్ కృష్ణ బిజెపి విశ్వకర్మ కౌసల్య విభాగం ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ కే రాఘవేంద్ర పాల్గొన్నారు

# ఆడబిడ్డ పెళ్లికి రూ. 3 లక్షల ఆర్థికసాయం.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 12:అమ్మా అధైర్య పడకండి.. నేను మీకు అండగా ఉంటా అంటూ ఇచ్చిన మాటను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలబెట్టుకున్నారు. ఏక్ పోలీసు విధానం అమలు చేయాలని ఆందోళన చేసిన మానకొండూర్ నియోజకవర్గం గంగిపల్లికి చెందిన బెటాలియన్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సర్వీస్ నుంచి తొలగించగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు.

ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు, ఈ నెల 14న తన చెల్లెలి పెళ్లి ఉండడంతో తన తల్లి తీవ్ర బాధలో ఉందని శ్రీనివాస్ రెండు రోజుల క్రితం సిరిసిల్ల పర్యటనకు వెళ్లిన కేటీఆర్‌ను కలిసి తెలిపాడు. వెంటనే శ్రీనివాస్ తల్లితో ఫోన్లో మాట్లాడిన కేటీఆర్, బిడ్డ పెళ్ళికి ఆర్థిక సహాయం చేస్తానని, శ్రీనివాస్‌ను మళ్ళీ ఉద్యోగంలోకి తీసుకునేలా కొట్లాడుతానని భరోసానిచ్చారు.

శ్రీనివాస్ తల్లికి ఇచ్చిన మాట ప్రకారం వారి కూతురి వివాహం కోసం రూ. 3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు ఈ రోజు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# ఏపీ పరిణామాలపై జోక్యం చేసుకోవాలని మానవహక్కుల సంఘానికి వైసీపీ ఫిర్యాదు

అమరావతి, నవంబర్ 12:ఏపీలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, వెంటనే జోక్యం చేసుకుని విచారణ జరపాలని వైసీపీ ఎంపీలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మేడ రఘునాథ్ రెడ్డి, డాక్టర్ తనూజా రెడ్డి, బాబురావులు మంగళవారం ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల సంఘం చైర్‌పర్సన్ విజయభారతిని కలిసి వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 57 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయించారని, 12 మంది కార్యకర్తల ఆచూకీ తెలియడం లేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఉండే పెద్దిరెడ్డి సుధారాణి అనే మహిళలను అరెస్టు చేయకుండా ఐదురోజుల పాటు అక్రమంగా నిర్బంధించి వేధించారని, కార్యకర్తలను బెదిరించి వారితో అనుకూల స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.

ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతుందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని, హోంమంత్రి, డీజీపీలు సక్రమంగా పనిచేయడం లేదని వెల్లడించారు. శాంతియుతంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను రెచ్చగొడితే పరిస్థితి ఎక్కడికెళ్తుందో తెలియదని పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు.

ఇప్పటికైనా పీఎం, సీఎం జోక్యం చేసుకుని అరాచకాలకు అడ్డువేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా కార్యకర్తలకు తాము అండగా ఉంటామని ఎంపీలు భరోసా ఇచ్చారు. ఏపీ పరిణామాలపై జోక్యం చేసుకుని మానవ హక్కులను , ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

